ఈ మార్గానికి మోక్షమెప్పుడో?

- నరకాన్ని తలపిస్తున్న శ్రీనివాసనగర్ సర్వీస్ రోడ్డు
- రాళ్లు, గుంతలతో ఇబ్బందులు



రాళ్లు తేలి అధ్వానంగా మారిన రహదారి



శ్రీనివాసనగర్‌లో గుంతలతో నిండిన సర్వీస్ రోడ్డు

మల్కాపురం: ప్రధాన రహదారులకు మాత్రమే మెరుగులు అద్దుతున్నారు.. సర్వీస్ రహదారులను అస్సలు పట్టించుకోవడం లేదు. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రేటర్ పరిధిలో ఉన్న..మారుమూల ఏజెన్సీలో కంటే దారుణమైన పరిస్థితులు నెలకున్నాయి. జీవీఎంసీ 58వ వార్డులో కోరమాండల్ రక్షణ గోడకు ఆనుకుని శ్రీనివాసనగర్ రహదారి అధ్వానంగా మారింది. మట్టి రోడ్డు కావడంతో వర్షం కురిసినప్పుడల్లా రాకపోకలు సాగించలేని పరిస్థితి. శ్రీనివాసనగర్ మీదుగా కోడిపందాలదిబ్బ ప్రాంతానికి వెళ్లే మార్గం 30 ఏళ్ల నుంచి తారు రోడ్డుకు నోచుకోవడం లేదు. కోడిపందాలదిబ్బ, శ్రీనివాస్‌నగర్, శ్రీహరిపురం తదితర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో జనం రాకపోకలు సాగిస్తున్నారు. వందల సంఖ్యలో వాహనదారులు వచ్చిపోతుంటారు. మట్టి రోడ్డుపై గుంతలు తేలి ఉండడంతో వాహనదారులు అదుపు తప్పుతున్నారు. పలువురికి గాయాలైన సంఘటనలూ ఉన్నాయి.మట్టి మార్గానికి మోక్షం కల్పించాలని 30 ఏళ్ల నుంచి కాలనీ వాసులతో పాటు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

వాహనాలు అదుపు తప్పుతున్నాయి



రాళ్లు తేలి ఉన్న ఈ మార్గంలో ద్విచక్ర వాహనం నడపలేని పరిస్థితి ఉంది. గత వారం కోడిపందాల దిబ్బ ప్రాంతానికి ఈ మార్గన ద్విచక్ర వాహనంతో వెళ్తే వాహనం అదుపు తప్పి గాయాలయ్యాయి. అధికారులు ఈ సమస్యపై స్పందించి ఈ మార్గానికి మోక్షం కల్పించాలని కోరుతున్నాం.

– పెద్దాడ వెంకటరమణ, వాహనదారుడు

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది



శ్రీనివాస్‌నగర్ నుంచి రాత్రి సమయంలో ప్రయాణించాలంటే చాలా ధైర్యం ఉండాలి. గుంతలు కారణంగా వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఇటీవల వాహనం అదుపు తప్పడంతో భుజానికి గాయమైంది. రహదారి మార్గంలో విద్యుత్ దీపాలు కూడా లేవు. అధికారులు స్పందించి రహదారిని మెరుగుపరచాలని కోరుతున్నాం.

–సి.నారాయణరావు, శ్రీనివాసనగర్

కరుణించే తల్లి బంగారు దుర్గమ్మ





అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ పీవీ సురేష్, సారె తీసుకొస్తున్న స్థానిక మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు హనుమాన్ సంజీవ్ కాలనీ కొండవాలు ప్రాంతంలో కొలువైన బంగారు దుర్గమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానికుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పీవీ సురేష్ పాల్గొని అమ్మవారికి వస్త్రాలు, పసుపు కుంకుమలను సమర్పించారు. అనంతరం ఆయన భక్తులతో కలిసి సామూహిక కుంకుమార్చన చేశారు. సుమారు వంద మంది స్థానిక మహిళలు వివిధ రకాల పిండివంటలు, పండ్లను అమ్మవారికి సారె రూపంలో తీసుకొచ్చారు. కనుల పండువగా సాగిన ఈ వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

టిడ్కో గృహ లబ్ధిదారుల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న కార్పొరేటర్ గల్లా చిన్నా

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పొందిన టిడ్కో గృహాల లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించేందుకు మెగా క్యాంపును నిర్వహించారు. జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతల్లోవలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు గల్లా చిన్నా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెగా క్యాంపులో టిడ్కో గృహాలు పొందిన లబ్ధిదారులు తమ సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. గృహాల కేటాయింపు, ఇంటి పన్నులు మంజూరు, మౌలిక సదుపాయాల కల్పన వంటి సమస్యల పరిష్కారాన్ని కోరారు. స్పందించిన కార్పొరేటర్ గల్లా చిన్నా సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గూడెల కృష్ణ, జెర్రిపోతుల నర్సింగరావు, పుక్కల కృష్ణ, బొండా కృష్ణ, అమెరికా శ్రీను, పుక్కల రామారావు, ధర్మ, కనకరాజు, నాగరాజు, నరీన్, శ్యామ్, విష్ణు, కుర్రు సతీష్, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేడుకగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ పీవీ సురేష్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హనుమాన్‌నగర్ వద్ద గల అభయ ఆంజనేయస్వామి ఆలయ 12వ వార్షికోత్సవం కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఆంజనేయస్వామి ప్రత్యేక పూజా కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ , 59వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణలు ఆంజనేయస్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.

63వ వార్డులో అన్నసమారాధన



అన్నదానం చేస్తున్న ఉత్సవ నిర్వాహకులు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో క్రాంతి స్టార్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాదేవిని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయనను ఉత్సవ నిర్వాహకులు శాలువాతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



రాంపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ప్రతినిధులు

పెందుర్తి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పెందుర్తి మండలం రాంపురం, పెదగాడి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. సమితి ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కె.త్రినాథరావు, జి.కృష్ణ, సూరప్పడు, ఎస్.సూర్యనారాయణ, ఎస్.అచ్చమ్మ, బి.అంకమ్మ, సంతోష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవయవ దాతల సంఘం కన్వీనర్‌గా శ్రీనివాస్



గూడూరు సీతామహలక్ష్మి నుంచి నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్

పెందుర్తి: రాష్ట్ర శరీర, అవయవ దాతల సంఘం పెందుర్తి జోన్ కన్వీనర్‌గా పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ గూడూరు సీతామహలక్ష్మి చేతుల మీదుగా ఆదివారం నియామక పత్రం అందుకున్నారు.

ధరలు తగ్గించాలని నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సింధియా: అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్న నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని ప్రభుత్వాన్ని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ కూడలిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ, నాయకుడు గుడాల రాంబాబు కాకరలోవ, చింతల్లోవ ప్రాంతాల్లోని ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి గెలిచిన తరువాత ప్రజా సమస్యలను గాలికొదిలేశారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, లేదంటే తమ ఆందోళనను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు త్రినాథ్, గోపి, కామేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు

సీతంపేట: చిన్నారులు తమదైన శైలిలోఅద్భుత చిత్రాలు గీసి అబ్బురపరిచారు. ఏబీయూ అకాడమీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో విద్యార్థులకు ఆదివారం చిత్రలేఖన, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. సోషల్ మీడియా దుష్ప్రభావాలు అనే అంశంపై పోటీ నిర్వహించారు. ఉదయం చిత్రలేఖనం, సాయంత్రం పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. తమ ఆలోచనలకు అద్దంపట్టేలా విద్యార్థులు అద్భుతమైన చిత్రాలు గీసి అబ్బురపరిచారు. అనంతరం పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకురాలు ఎస్.ఉషారాణి పర్యవేక్షించారు.

అవకాశాల కల్పనే కళాకారులకు నిజమైన ప్రోత్సాహం

గాయకుడు గజల్ శ్రీనివాస్



గజల్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వైజాగ్ బీట్స్ సంస్థ వ్యవస్థాపకురాలు శారద తదితరులు

ఎంవీపీకాలనీ: ప్రతిభకు అనుగుణంగా సినిమా, ఇతర రంగాల్లో అవకాశాలు కల్పించడమే కళాకారులకు నిజమైన ప్రోత్సాహమని గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. సినీ గాయకుల వేదిక వైజాగ్ బీట్స్ సంస్థ 8వ వార్షికోత్సవం ఆదివారం ఎంవీపీ కాలనీ బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం జరిగిన గాయకుల సత్కార వేడుకలో గజల్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. కళా నైపుణ్యం ఉన్న వారికి ప్రస్తుతం అవకాశాలు కోకొల్లలుగా ఉన్నాయని చెప్పారు. వారి ప్రతిభను సమాజానికి తెలియజేసేలా అవకాశం ఉన్న ప్రతి వేదికపైనా సత్తా చాటాలన్నారు. కొత్త కళాకారులకు సినీ రంగ ప్రముఖులు అవకాశాలు కల్పించాలని కోరారు. వైజాగ్ బీట్స్ గాయకులు అద్భుతంగా వారి సంగీత నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ఉదయం సినిమా డైరెక్టర్ పీసీ ఆదిత్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైజాగ్ బీట్స్ తరపున హెచ్ఐవీ బాలలను సంరక్షిస్తున్న డిజైర్ సొసైటీ నిర్వాహకుడు లక్ష్మణ్‌కు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. గజల్ శ్రీనివాస్‌తోపాటు డైరెక్టర్ పీసీ ఆదిత్యను సంస్థ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. గాయకులు అతిథుల చేతుల మీదగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. కార్యక్రమంలో వైజాగ్ బీట్స్ వ్యవస్థాపకురాలు డి.శారద, ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన సంస్థ సభ్యులైన గాయనీ గాయకులు పాల్గొన్నారు.

జోరుమీదున్న జూదగాళ్లు

- శివారు ప్రాంతాల్లో కోడి పందాలు, పేకాట శిబిరాలు
- తోటలు, నిర్మానుష్య ప్రాంతాలే నిర్వహణ కేంద్రాలు
- అంతా కూటమి నేతల కనుసన్నల్లోనే..
- చోద్యం చూస్తున్న పోలీసులు



పెందుర్తి పోలీసులు పందాల్లో స్వాధీనం చేసుకున్న పందెం కోళ్లు(ఫైల్)

పెందుర్తి: పండగల వేళ శివారు ప్రాంతాల్లో కోడి పందాల జోరు కొనసాగుతోంది. తోటలు, చెరువు గట్ల దిగువ, నిర్మానుష్య ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కానీయకుండా పందాలు నిర్వహిస్తున్నారు. ఓ వైపు కోడి పందాలు, మరోవైపు పేకాట శిబిరాలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా వారాంతపు రోజుల్లో కోళ్ల కాలు దువ్వుతున్నాయి. పెందుర్తి, సబ్బవరం, పరవాడ శివారు ప్రాంతాల్లోని తోటలు వేదికగా శని, ఆదివారాల్లో జోరుగా పందాలు వేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పందాలపై నియంత్రణ ఉండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు, నాయకుల అండ చూసుకుని జూదగాళ్లు రెచ్చిపోతున్నారు.

జూదానికి చాలా అనుకూలం

నియోజకవర్గ పరిధిలో తోటలు అధికం. పెందుర్తి, అక్కిరెడ్డిపాలెం, నరవ, జెర్రిపోతులపాలెం, సతివానిపాలెం, చినముషిడివాడ వుడా కాలనీ, సబ్బవరం, పరవాడ తదితర ప్రాంతాల్లో వందల ఎకరాల్లో జీడిమామిడి, మామిడి, సరుగుడు తోటలు విస్తారంగా ఉన్నాయి. ఇవి చాలావరకు పేకాట, కోడిపందాలకు అనుకూలంగా ఉన్నాయి. వీటితో పాటు అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు కూడా పేకాటకు అనుకూలంగా మారాయి. ఆయా ప్రాంతాలే పందెంరాయుళ్లకు స్థావరాలు. ప్రత్యేకంగా కొందరు వ్యక్తులతో కూడిన గ్రూపులు ఈ డెన్‌లను నడిస్తున్నాయి. వీరు ఆటకు ఇంత అని నిర్ధారించి ఆటగాళ్లదగ్గర వసూలు చేస్తుంటారు. ఆటగాళ్లకు మద్యం, ఇతర త్రా సౌకర్యాలు కల్పిస్తుంటారు. ఆటలో పందాలు రూ.లక్షల్లోనే ఉన్నట్లు సమాచారం. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుని స్మార్ట్ ఫోన్ల ద్వారా అక్కడికక్కడే ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌లు చేసుకుంటున్నారు. మరికొంత మంది భూములు, వాహనాల పత్రాలు ష్యూరిటీగా పెట్టి పందాలు కాస్తున్నారు.

కింది స్థాయి సిబ్బంది కనుసన్నల్లోనే!

జూదాన్ని నియంత్రించాల్సిన పోలీసులే చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జూదరులు బరి తెగించడం గమనార్హం. కోడి పందాలు, పేకాట శిబిరాల గురించి కిందిస్థాయి పోలీస్ సిబ్బందికి తెలిసినా వారిని 'మామూళ్ల'గా స్థానిక కూటమి నాయకులు సర్దిచెప్పుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. గతంతో పోల్చితే నియోజకవర్గంలో ఇలాంటి శిబిరాలపై పోలీసుల దాడులు లేకపోవడం ఆరోపణలకు బలం చేకూర్చుతోంది.

కఠినంగా వ్యవహరిస్తాం

జూదం, కోడిపందాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా నిషిద్ధం. ఆయా అంశాలపై కఠినంగా వ్యవహరిస్తాం. పందాలు నిర్వహించేవారు ఎంతటివారైనా వదిలిపెట్టం. ఇతర నేరాలపై కూడా మా సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రజలు కూడా ఇటువంటి వాటిపై మాకు సమాచారం ఇచ్చి సహకరించాలి. 94407 96039, 0891-2764233 ఫోన్ నంబర్ల ద్వారా మమ్మల్ని సంప్రదించవచ్చు.

– కె.వి.సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

ఏయూ ప్రొఫెసర్ వెంకటస్వామికి అబ్దుల్ కలాం పురస్కారం



ప్రతిభా పురస్కారం స్వీకరిస్తున్న ఏయూ తెలుగు ఆచార్యుడు బూసి వెంకటస్వామి

మద్దిలపాలెం: దక్షిణాది రాష్ట్రాల్లో అత్యంత ప్రతిభావంతులైన, వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికిచ్చే డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగ ఆచార్యుడు డాక్టర్ బూసి వెంకటస్వామి అందుకున్నారు. గుంటూరు ఏసీ కళాశాల ఆడిటోరియంలో సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అభినందన సభలో వెంకటస్వామికి అవార్డు ప్రదానం చేశారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ కె.మోజేష్, మలినేని విద్యా సంస్థల డైరెక్టర్ మలినేని పెరుమాళ్ల, అప్సా డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు, అప్సా డైరెక్టర్ మేకల రవీంద్రబాబు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా బూసి వెంకటస్వామిని ఏయూ ఉన్నతాధికారులు, తెలుగు విభాగ ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు, తెలుగు సాహితీ, భాషాభిమానులు అభినందించారు.

సత్యసాయి అవతార వైభవం



మహా నగర సంకీర్తనను ప్రారంభిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు



విద్యుద్దీప కాంతుల్లో సత్యసాయి ప్రేమసదన్

బీచ్‌రోడ్డు: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా దివ్య అవతార ప్రకటన దినోత్సవం సందర్భంగా ఆదివారం సిటీ సత్యసాయి సమితి ఆధ్వర్యంలో మహా నగర సంకీర్తన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేక భజన చేసి అక్కడ నుంచి సంకీర్తన ప్రారంభించారు. పెదవాల్తేరు, శాంతి ఆశ్రమం, లాసన్స్ బే కాలనీ, ఉషోదయ జంక్షన్ మీదుగా ప్రేమ సదన్ మందిరానికి సంకీర్తన ఊరేగింపు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ డి.వి.వి.సీతారామరాజు మాట్లాడుతూ బాబా 14 ఏళ్ల వయసులో భక్తుల కోసం వెళ్లాలని చెప్పి ఇంటి నుంచి వచ్చిన రోజును దివ్య అవతార ప్రకటన రోజుగా జరుపుతున్నామన్నారు. నవంబర్ రెండో శనివారం నాడు ప్రపంచ వ్యాప్తంగా ఒకేసారి 24 గంటల నామస్మరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సంకీర్తనల అనంతరం సత్యసాయి భక్తులకు అల్పాహార ప్రసాదం అందజేశారు.

శోభాయమానంగా ప్రేమసదన్

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయిబాబా అవతార ప్రకటన దినోత్సవం సందర్భంగా ఎంవీపీ కాలనీ సెక్టార్–8లోని సత్యసాయి ప్రేమసదన్‌ను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ప్రేమసదన్‌లో సత్యసాయికి వింజామర సేవ, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. మహా నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు తెలిపారు.

వార్షికోత్సవ సందడి

దాబాగార్డెన్స్: ఆర్యవైశ్య యువజన సంఘ వార్షికోత్సవం ఆదివారం వన్‌టౌన్ సమీపాన గల వాసవీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దుర్గా సోమేశ్వరరావు సంఘ ఆవిర్భావం గురించి వివరించారు. కార్యదర్శి కేఎస్ రామారావు వార్షిక నివేదిక అందజేశారు.

ఘనంగా 50వ స్వర్ణోత్సవ సభ



మాట్లాడుతున్న శ్రీకాంత్ మిశ్రా

దాబాగార్డెన్స్: ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ 50వ స్వర్ణోత్సవ సర్వసభ్య సమావేశం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. సమావేశానికి ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు, సౌత్ సెంట్రల్ జోన్ నుంచి జోనల్ నాయకులు, పలు డివిజన్ల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అసోసియేషన ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా మాట్లాడుతూ ఐసీఈయూ 50 ఏళ్ల పూర్తి చేసుకున్నందుకు, కొత్త భవనం సమకూర్చుకున్నందుకు, యూనియన్ నాయకత్వానికి, సభ్యులకు అభినందనలు తెలిపారు. 50 ఏళ్ల పూర్తి చేసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి దోహదపడే ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, ప్రైవేటుపరం చేయడానికి ప్రస్తుత ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్న సమయంలో ఏఐఐఈఏ అందులో భాగమైన ఐసీఈయూ అనేక పోరాటాలు చేస్తూ, ఇన్సూరెన్స్ రంగంలోని ఎల్ఐసీని ప్రైవేట్ పరం చేయకుండా నిలువరించగలిగినట్లు తెలిపారు. ఈ ప్రస్థానంలో ఐసీఈయూ పాత్ర ఎంతో కీలకమన్నారు.

మద్యం దుకాణాలకు షాపులు కావలెను!

20 వెతుకులాట ప్రారంభించిన వ్యాపారులు

గాజువాక: మద్యం షాపుల ఏర్పాటు చేయడానికి అద్దె భవనాల కోసం వ్యాపారులు వెతుకులాట ప్రారంభించారు. నూతన మద్యం పాలసీ అమలైన నేపథ్యంలో ప్రభుత్వం కొత్త మద్యం దుకాణాలు కేటాయించింది. ఇప్పటికే కొన్ని దుకాణాలు ఏర్పాటయ్యాయి. మరిన్ని దుకాణాలు ప్రారంభించడానికి మద్యం వ్యాపారులు అద్దె భవనాల కోసం వేట ప్రారంభించారు. గాజువాక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇప్పటికే 20 వరకు ఏర్పాటు చేసినట్టు సమాచారం. గాజువాక, పారిశ్రామిక ప్రాంతంలో మొత్తం 50 దుకాణాల ఏర్పాటుకు అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రొవిజనల్ అనుమతులపై మద్యం దుకాణాలు ఏర్పాటైన విషయం తెలిసిందే. ఆయా దుకాణాలకు పూర్తి స్థాయిలో అనుమతులు ఇచ్చిన తర్వాత కొత్త దుకాణాలపై కూడా స్పష్టత వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

రౌడీషీటర్లు అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ లక్ష్మణమూర్తి

సీతమ్మధార : సమాజంలో అల్లర్లు సృష్టిస్తే రౌడీషీటర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని, సత్ప్రవర్తనతో మెలగాలని ఈస్ట్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి సూచించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి నుంచి వేలిముద్రలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్లపై నిత్యం పోలీసుల నిఘా ఉంటుందన్నారు.

మంచిగా ఉంటే మంచిగా ఉంటామని... గొడవలకు పాల్పడినా, ఎవరినైనా బెదిరించినా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. సీఐ ఎస్.విజయకుమార్, ఎస్ఐ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.